మారుతి కొత్త కార్లు వచ్చేస్తున్నాయి..

2025లో నాలుగు కార్లను విడుదల చేయనున్న సంస్థ

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ టాప్ గేర్‌లో దూసుకుపోతున్నది. ఇప్పటికే కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్న సంస్థ..కొత్త ఏడాదిలో నయా మాడళ్లను విడుదల చేయబోతున్నది. ఢిల్లీ వేదికగా జరగనున్న వాహన పండుగలో ఈ కొత్త మాడళ్లను ప్రదర్శిస్తున్నది. వీటిలో తొలి ఎలక్ట్రిక్ వాహనంతోపాటు మూడు ఎస్‌యూవీ మాడళ్లు ఉన్నాయి. వీటి వివరాలు..

మారుతి ఈ-విటారా:

దేశీయంగా ఈవీ కార్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని మారుతి కూడా ఈ మాడళ్లను విడుదల చేయడానికి సిద్ధమైంది. వచ్చే నెలలో 17 నుంచి 22 వరకు ఢిల్లీలో జరుగుతున్న భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో తన తొలి ఈ-విటారాను ప్రదర్శించబోతున్నట్లు తెలుస్తున్నది. 49 కిలోవాట్లు, 61 కిలోవాట్లా బ్యాటరీ సామర్థ్యంతో రూపొందించిన ఈ కారు ధర రూ.22 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. సింగిల్ చార్జింగ్‌తో 550 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 10.25 ఇంచుల టచ్‌స్క్రీన్ ఇన్ఫోసిస్టమ్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, 360-డిగ్రీల కెమెరా వంటి ఫీచర్స్ ఉన్నాయి.

నయా గ్రాండ్ విటారా

కాంపాక్ట్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేయడానికి నయా గ్రాండ్ విటారాను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. వచ్చే ఏడాది జూన్‌లో ప్రవేశపెట్టనున్న ఈ కారును సరికొత్తగా తీర్చిదిద్దినట్లు, ముఖ్యంగా ఇంటీరియర్ డిజైనింగ్, డ్యాష్‌బోర్డ్, ఐదు-ఏడుగురు కూర్చోవడానికి విధంగా డిజైన్ చేసింది.

కొత్త బాలెనో

ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ బాలెనోను మరింత ఆధునీకరించి విడుదల చేయడానికి సిద్ధమైంది మారుతి. మార్చి నెలలో అందుబాటులోకి రానున్న ఈ కారులో అతిపెద్ద టచ్‌స్క్రీన్, ఫుల్ డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, సింగిల్-పాన్ సన్‌రూఫ్, వైర్‌లెస్ ఫోన్ చార్జర్, టైర్-ప్రెషర్ మానటరింగ్ సిస్టమ్, ఆరు ఎయిర్ బ్యాగ్‌లతో తీర్చిదిద్దింది.

అప్‌గ్రేడ్ బ్రెజ్జా

మూడేండ్ల క్రితం అందుబాటులోకి తీసుకొచ్చిన బ్రెజ్జాను మళ్లీ ఆధునీకరించి మార్కెట్లో విడుదల చేయబోతున్నది సంస్థ. స్కోడా కైలాక్, కియా సైరోస్‌ల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోవడానికి ఈ నయా మాడల్‌ను తెస్తున్నది.

పెట్టుబడులపై ఫార్ములా-ఈ ఎఫెక్ట్!

ప్రభుత్వంతో ఒప్పందాలకు జంకుతున్న పారిశ్రామికవేత్తలు
స్నేహపూర్వక వాతావరణం లేదంటున్న ఇండస్ట్రీ వర్గాలు
కంగారు పడుతున్న అధికారులు.. భవిష్యత్తుపై ఆందోళన

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలపై కాంగ్రెస్ సర్కారు అవలంభిస్తున్న వైఖరితో పరిశ్రమ వర్గాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. తాజాగా ఫార్ములా-ఈ రేసు ఒప్పందంపై విచారణ చేపట్టడం, కేసులు నమోదు చేయడంతో అటు పెట్టుబడిదారులు, ఇటు అధికార వర్గాలు కలత చెందుతున్నాయి. రాష్ట్రంలో ఇక ఏమాత్రం పరిశ్రమకు స్నేహపూర్వక వాతావరణం లేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది. ప్రభుత్వ వైఖరితో పరిశ్రమ భవిష్యత్తు అంధకారమయ్యే అవకాశముందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ సంగతి..

సహజంగా రాష్ట్రాలు అమలు చేసే సరళీకృత విధానాలు, ప్రభుత్వాల పనితీరు, స్నేహపూర్వక వాతావరణం తదితర అంశాల ఆధారంగా పెట్టుబడులు పెట్టడం, ప్రభుత్వాలతో ఒప్పందాలు చేసుకోవడం జరుగుతుంది. పెట్టుబడిదారులు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాక నిశ్చింతగా ఆర్థిక వనరులను సమకూర్చుకోవడం, తదుపరి చర్యలు చేపట్టడం చేస్తారు. స్వతహాగానే ప్రభుత్వాలపై భరోసా ఉంటుంది కాబట్టి ధైర్యంగా వ్యాపారాలు చేసేందుకు ముందుకొస్తారు. అంతే కాదు, ప్రజాస్వామ్యంలో ఐదేండ్లకోసారి ప్రభుత్వాలు మారడం సహజ ప్రక్రియ. ఒక ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాన్ని ఆ తదుపరి వచ్చే ప్రభుత్వం కొనసాగించడం ఆనవాయితీ. దశాబ్దాలుగా ఇదే తరహా సంప్రదాయం కొనసాగుతూ వస్తున్నది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏదైనా పథకాన్ని కొనసాగించడం తదుపరి ప్రభుత్వానికి ఇష్టం లేకున్నా అప్పటికే మొదలైన పనులను పూర్తిచేసిన తరువాతే వాటిని నిలిపివేస్తారు. ఒప్పందాలు మాత్రం రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా యథావిధిగా కొనసాగించాల్సి ఉంటుంది.

కేసులతో రచ్చ

గడిచిన పదేండ్లలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన స్నేహపూర్వక విధానాలకు ఆకర్షితులై ఎన్నో దేశ, విదేశాలకు చెందిన కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకొని వ్యాపారాలు చేసేందుకు, పరిశ్రమలు పెట్టుకునేందుకు ముందుకొచ్చాయి. అందులో ఫార్ములా-ఈ రేస్ కూడా ఒకటి. ఢిల్లీ, ముంబైకి సైతం దక్కని ఖ్యాతిని హైదరాబాద్‌కు సాధించాలనే సంకల్పంతోపాటు కాలుష్యరహిత రవాణాను ప్రోత్సహించే ఉద్దేశంతో బీఆర్ఎస్ సర్కారు ఆనాడు కార్ రేస్‌ను నిర్వహించాలని నిర్ణయించి ఒప్పందం చేసుకున్నది. ఎంతో వ్యయ ప్రయాసలతో కూడిన ఈ రేస్‌లను అర్ధాంతరంగా నిలిపివేయడంతో నిర్వాహకులు ఆర్బిట్రేషన్‌ను ఆశ్రయించారు. ఈ వ్యవహారం నడుస్తుండగానే అప్పటి మంత్రితోపాటు అధికారులపై కూడా ప్రభుత్వం కేసులు నమోదు చేయడం ఇప్పుడు సర్వత్రా చర్చకు దారితీసింది.

ఆందోళన

గతంలో అనేక కంపెనీలు ప్రభుత్వం కల్పించే ప్రోత్సాహకాలు, ఇచ్చిన హామీలకు ఆకర్షితులై పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ఇందులో కొన్ని కంపెనీలు ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించగా, మరికొన్ని కంపెనీల వివిధ దశల్లో ఉంది. తాజాగా ప్రభుత్వం ఫార్ములా-ఈ విషయంలో తీసుకున్న నిర్ణయంతో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న కంపెనీలతో పాటు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్న కంపెనీల్లో ఆందోళన మొదలైంది. ఫార్మాసిటీ విషయంలోనూ ఇంచుమించు ఇలాగే జరిగింది. అన్ని అనుమతులూ వచ్చి పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్న ఫార్మా సిటీని రద్దు చేయడంతో అప్పటికే పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న కంపెనీలు అయోమయంలో పడ్డాయి. ఈ పరిణామాలు చూస్తుంటే ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదనే భావన సర్వత్రా కలుగుతున్నది. దీంతో ప్రభుత్వం తరపున ఒప్పందాలు చేసుకునేందుకు అధికారులు కూడా జంకుతున్నారు. ఇటీవల పలువురు ఐఏఎస్ అధికారులు సమావేశమై.. లిఖితపూర్వకంగా ఇస్తే తప్ప ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయరాదని నిర్ణయించినట్టు వార్తలు రావడం దీనికి నిదర్శనంగా చెప్పవచ్చు. ప్రభుత్వ వైఖరి ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో పరిశ్రమ భవిష్యత్తు ఎలా ఉంటుందో అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

టెలికం సంస్థలకు ఇక్కట్లే!

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: దేశీయ ప్రైవేట్ టెలికం సంస్థలకు కొత్త ఏడాదిలో ప్రధానంగా రెండు సవాళ్లు ఎదురుకావచ్చన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ ఏడాది ఆయా టెలికం కంపెనీలు టారిఫ్‌లను పెంచిన విషయం తెలిసిందే. అయితే ఇది రివర్స్ ఫైర్ అయిందన్న సంకేతాలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రధాన టెలికం సంస్థల నుంచి కస్టమర్లు ఇతర సంస్థల్లోకి మారిపోతున్నారు. దీంతో వచ్చే ఏడాదీ ఈ జంపింగ్‌లుంటాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నిజానికి ఇప్పటికే రిచార్జ్ ప్లాన్ల ధరలు తారెత్తిస్తున్నాయి. అయినప్పటికీ ఖర్చులు పెరిగాయన్న కారణాలతో టెలికం ఆపరేటర్లు ధరల భారాన్ని కస్టమర్లపై మోపుతూనే ఉన్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మధ్యలో ధరలు మరింత పెరగడంతో సబ్‌స్క్రైబర్ల సంఖ్య పెద్ద ఎత్తునే పడిపోయింది. రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాల్లో చార్జీలు 10 నుంచి 26 శాతం మేర పెరిగాయి. దీంతో ఆయా సంస్థలు 2.6 కోట్ల కస్టమర్లను కోల్పోయాయని అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. మరోవైపు దాదాపు 68 లక్షల కస్టమర్లు ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ కనెక్షన్‌ను తీసుకున్నట్టు తేలింది. ఇప్పటికీ బీఎస్ఎన్ఎల్ 3జీ సర్వీసులనే ఇస్తుండగా, 4జీ సేవల విస్తరణ పనుల్లో ఉండటం గమనార్హం. అయినప్పటికీ కొత్త కస్టమర్లు వస్తున్నారంటే ధరల భారం ఏ స్థాయిలో ప్రైవేట్ కంపెనీలకు ప్రతికూలంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.

శాట్కామ్‌ల ఎంట్రీతో..

వచ్చే ఏడాది శాటిలైట్ ఆధారిత సేవల సంస్థలతోనూ టెలికం కంపెనీలకు మార్కెట్‌లో భారీగానే పోటీ ఉండొచ్చన్న అంచనాలున్నాయి. ప్రధానంగా ఎలాన్ మస్క్ స్టార్‌లింక్ రాకతో ప్రస్తుతం టెలికం సంస్థలకు పెద్ద ఎత్తున ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న డాటా వ్యాపారానికి ఎదురుదెబ్బేనన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. శాట్కామ్ సర్వీసులతో ధరల యుద్ధానికి వీలుందని, డాటా ధరలు ఇంకా పడిపోవచ్చని చెప్తున్నారు. ఇదే గనుక జరిగితే ప్రైవేట్ రంగ టెలికం సంస్థలకు నష్టాలే. 5జీ సేవలను దేశవ్యాప్తంగా విస్తరిస్తూ పోతున్న టెల్కోలు.. అందుకోసం రూ.70వేల కోట్లదాకా పెట్టుబడులు పెట్టాయి.

ఫండ్లలో మహిళా ఇన్వెస్టర్ల జోరు

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: దేశీయ మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీలో మహిళా పెట్టుబడిదారులు భారీగా పెరుగుతున్నారు. ప్రస్తుత సంవత్సరంలో చిన్న, మధ్యస్థాయి నగరాల నుంచి అత్యధిక మంది మహిళలు ఫండ్లలో ఇన్వెస్ట్ చేస్తున్నారని, గడిచిన ఏడాదికాలంలో వీరి సంఖ్య రెండున్నర రెట్లు పెరిగినట్లు ఆన్‌లైన్ బ్రోకరేజ్ సంస్థ గ్రోవ్ తెలిపింది. మహిళల్లో ఆర్థిక స్వావలంభన పెరుగుతున్నదని, ముఖ్యంగా పట్టణ, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలతోపాటు చిన్న స్థాయి నగరాల్లో సైతం 140 శాతం పెరిగిందని, దీంతో వీరు ఈక్విటీ మార్కెట్లతోపాటు ఎంఎఫ్ మార్కెట్లలో విరివిగా పెట్టుబడులు పెడుతున్నట్లు వెల్లడించింది. మిగతా రంగాలకు దూరంగా ఉంటున్న మహిళలు..ఈక్విటీ, ఫండ్లలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నట్లు, ఈ ఏడాది కోటి మందికి పైకి చేరుకున్నారని గ్రోవ్ కో-ఫౌండర్, సీఈవో లలిత్ కేశ్రా తెలిపారు. గడిచిన ఏడాదికాలంలో మెట్రో, టైర్-1,2,3 నగరాల్లో ఫండ్లలో పెట్టుబడులు పెట్టే మహిళలు 100 శాతం చొప్పున పెరిగారు. నగరాల వారీగా చూస్తే ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, పూణె, లక్నో, అహ్మదాబాద్, జైపూర్ వంటి మెట్రో నగరాల నుంచి అత్యధిక మంది మహిళలు మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేశారు. అలాగే పురుషుల కంటే సిప్‌లలో మహిళలు అత్యధికంగా పెట్టుబడులు పెట్టడం విశేషం. ఈ ఏడాది మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ ఏయూఎం రూ.17 లక్షల కోట్ల మేర పెరిగిందని ఆంఫీ తెలిపింది. డిసెంబర్ 2023లో రూ.50.79 లక్షల కోట్లుగా ఉన్న ఫండ్ ఆస్తుల విలువ ప్రస్తుతం రూ.68 లక్షల కోట్లకు చేరుకున్నది. అలాగే గత నెలలో దేశీయ స్టాక్ మార్కెట్లో కొత్తగా 42.76 లక్షల మంది చేరారు. అలాగే గడిచిన నాలుగేండ్లుగా ప్రతియేటా 3 కోట్ల డీమ్యాట్ ఖాతాలు ప్రారంభిస్తున్నారు.

ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న ఆర్‌సీవో

గిరిజన విద్యార్థులకు చేయూత

ఉట్నూర్, డిసెంబర్ 28: గిరిజన విద్యార్థులకు చేయూత అందిస్తున్నట్లు గురుకులం ఆర్‌సీవో ఆగస్టిన్ అన్నారు. శనివారం ఉట్నూర్‌లోని తన కార్యాలయంలో ఎన్ఐటీ ఆగర్తలో సీటు సాధించిన నలుగురు విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకురాలు పుష్పా రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించేందుకు కృషి

ఎదులాపురం, డిసెంబర్ 28 : గ్రామీణ ప్రాంత క్రీడాకారులను గుర్తించి క్రీడల్లో రాణించేందుకు ప్రభుత్వం సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నదని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు స్పోర్ట్స్ దుస్తులను క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ పంపిణీ చేశారు. రాష్ట్ర స్థాయిలో రాణించి జిల్లాకు పతకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ఈ నెల 30న హైదరాబాద్, ఖమ్మం, వరంగల్ తదితర ప్రాంతాల్లో జరిగే ఆయా క్రీడల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొంటారన్నారు. గ్రామీణ స్థాయి నుంచి ఏ విధంగానైతే కష్టపడి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారో అదే స్ఫూర్తిని ప్రదర్శిసూ రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవైఎస్ వెంకటేశ్వర్లు, గిరిజన క్రీడాభివృద్ధి అధికారి పార్థసారథి, రాజేశ్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆరు నెలల వేతనాలు ఇవ్వాలి

ఎదులాపురం, డిసెంబర్ 28 : 104 ఉద్యోగుల పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలు ఇవ్వాలని తెలంగాణ యూనైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, నాయకులు శనివారం ఆదిలాబాద్‌లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలలుగా వేతనాల కోసం అధికారులను కలిసిన సందర్భంలో నాలుగు నెలలకు సంబంధించిన బడ్జెట్ రిలీజ్ చేస్తూ సర్క్యులర్ ఇచ్చి నెల రోజులు గడిచిన జిల్లాలకు బడ్జెట్ రాలేదన్నారు. తద్వారా 104 ఉద్యోగులకు ఆరు నెలల నుంచి వేతనాలు లేక అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కలిపించాలని కోరారు. ఇక్కడ సురేందర్, సుభాష్, ఇబ్రహీం, వెంకన్న, ఆనంద్, శ్రీకాంత్ ఉన్నారు.

జమాత్ ఈ హింద్ కార్యాలయం ప్రారంభం

ఎదులాపురం, డిసెంబర్ 28: ఆదిలాబాద్‌లో జమాత్ ఈ హింద్ జిల్లా కార్యాలయాన్ని శనివారం తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ముఫ్తీ మహ్మద్ జుబేర్ ఖాస్మీలు, ప్రధాన కార్యదర్శి జమియత్ ఉలేమా-ఎ-హింద్ తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్, ఆదిలాబాద్ టౌన్ సదర్ హఫీజ్ అమీర్ పటేల్, జిల్లా ప్రధాన కార్యదర్శి జమియత్ ఉలేమా-ఎ-హింద్, నాగరాజు, రంజిత్, కృష్ణ, జమీల్ ఖాన్, అలీమ్ ఖాన్, ఖయ్యూమ్ పాల్గొన్నారు.

డా.వేణుగోపాలకృష్ణకు సన్మానం

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 28: ప్రముఖ వైద్యుడు డా.వేణుగోపాలకృష్ణను నిర్మల్‌లోని బుధవార్‌పేట శివకోటి మందిరం నాలుగో వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఉత్తమ వైద్యుడిగా సేవలందించడంతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు తీసుకోవడం పట్ల ఆయనను సన్మానించారు. ఆలయ కమిటీ సభ్యులు మారుగొండ నరేందర్, జగడం రాజు, అభి, కరుణాకర్, పూదరి సాయి, అదుముల్ల ఉదయ్‌చంద్ర, భోజన్న, సల్ల కిషన్, మల్లేశ్, శ్రావణ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

డంప్‌యార్డును సక్రమంగా నిర్వహించాలి

నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 28 : డంప్ యార్డు నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి నిర్మల్ సమీపంలోని డంప్‌యార్డును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డంప్ యార్డు నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. నిర్మల్‌లోని ప్రతి ఇంటి నుంచి నిత్యం తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంప్‌యార్డుకు తరలించాలన్నారు. సెగ్రిగేషన్ ప్రదేశంలో ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ డబ్బాలు, పేపర్, తుక్కు, అట్టపెట్టలను వేర్వేరుగా విభజించి పునర్వినియోగానికి వీలుండే చెత్తను వేర్వేరుగా విభజించాలన్నారు. డంప్‌యార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

డంప్‌యార్డును సందర్శిస్తున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నుమాయిష్ ఎగ్జిబిషన్ పటిష్ట ఏర్పాట్లు చేయాలి

నిర్మల్‌లో జనవరి 5 నుంచి 7 వరకు నిర్వహించబోయే నుమాయిష్ ఎగ్జిబిషన్ కు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి జిల్లా శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎగ్జిబిషన్‌కు సందర్శనకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఆర్డీవో రత్నకళ్యాణి, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, డీఈవో రామారావు, డీఎస్‌వో కిరణ్‌కుమార్, ఈడీఎం నదీమ్, డీఎంహెచ్‌వో రాజేందర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలి

తానూర్, డిసెంబర్ 28 : ఉపాధి హామీ పథకంలో రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన 14వ విడుత ప్రజావేదికలో ఆమె మాట్లాడారు. వ్యవసాయ అనుబంధ యూనిట్లను రైతులకు అందించాలన్నారు. పశువుల, గొర్రెల పాకలు, కొళ్ళ, చేపల పెంపకం, నీటి అవసరాల కోసం ఫాంపాండ్‌లను అందించి రైతులను ప్రోత్సహించాలని అన్నారు. అంతకు ముందు ఈజీఎస్‌లో రూ.7 కోట్ల 45 లక్షలతో చేపట్టిన పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీలో నివేదికలపై విచారణ చేపట్టారు. పలు గ్రామాల్లో సంతకాలు లేకుండా, పని చేయని రోజులకు వేతనాలు చెల్లించినట్లు తనిఖీ బృందాలు వెల్లడించాయి. ఆయిల్ పామ్ పేరిట బిల్లులు చెల్లించినప్పటికీ క్షేత్రస్థాయిలో మొక్కలు లేవని గుర్తించినట్లు నివేదించారు. నివేదికల ఆధారంగా అధికారులు సంబంధిత సిబ్బందికి రూ. 8,627 రికవరీ, రూ. 4 వేల జరిమానాను విధించారు. కార్యక్రమంలో హెచ్ ఆర్ మేనేజర్ సుధాకర్, అంబుడ్స్ మెన్ నవీన్, ఎంపీడీవోలు అబ్దుల్ సమద్, శ్రీనివాస్, ఎంపీవో నసురొద్దీన్, ఎస్ఆర్పీ పాండురంగ్, ఏపీవో గంగాధర్, టీఏలు, ఎఫ్ఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఖైదీలకు సికిల్ సెల్, షుగర్ పరీక్షలు

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో నరేందర్

ఎదులాపురం, డిసెంబర్ 28 : ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉన్న ఖైదీలకు సికిల్ సెల్, షుగర్ పరీక్షలు చేశారు. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన వంద రోజుల టీబీ క్యాంప్ నిక్షయ శిబిరంలో భాగంగా శనివారం జిల్లా జైలులో ఖైదీలకు టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో నరేందర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల నుంచి వచ్చిన ఖైదీలకు సికిల్ సెల్, షుగర్ పరీక్షలు చేయడం జరిగిందన్నారు. జైలు సూపరింటెండెంట్ అశోక్ కుమార్, డీటీసీవో డాక్టర్ సుమలత, ఎన్‌సీడీ పీవో శ్రీధర్, డాక్టర్లు సాయిప్రియ, సయ్యద్ అన్సారి, డిప్యూటీ జైలర్ కృష్ణ, ట్రైనీ డిప్యూటీ జైలర్ ప్రేమ్‌కుమార్, జైలు డాక్టర్ అర్షమ ఫాతిమా, పారామెడికల్ సిబ్బంది, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 28: రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలో నిర్మల్ జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రదర్శన కనబరిచినట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన సీఎం కప్ వెయిట్ లిఫ్టింగ్ 77 కిలోల విభాగంలో సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న బీరవెల్లి గ్రామానికి చెందిన సగ్గం వర్షిణి బంగారు పతకం సాధించారు. 102 కిలోల విభాగంలో దస్తూరాబాద్ మండలం మున్యాల జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న కొట్టె అభిషేక్ కాంస్య పతకాన్ని సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు.

విధుల్లో చేరిన సిబ్బంది

తిరిగి విధుల్లో చేరిన బోధనేతర సిబ్బంది

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 28: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరవధిక దీక్షలో కూర్చున్న నిర్మల్ అర్బన్ కేజీబీవీ బోధనేతర సిబ్బంది తిరిగి తమ విధుల్లోకి శనివారం సాయంత్రం చేరారు. కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో రామారావు, విద్యాశాఖ అదికారులను కలిసి విధుల్లో చేరుతున్నట్లు తెలిపారు. బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించేందుకు అధికారులతో చర్చిస్తామన్నారు. మిగతా కేజీబీవీల్లోని నాన్ టీచింగ్ స్టాఫ్ వెంటనే విధుల్లో చేరాలని తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల సహాయ కమిషనర్ సిద్ధ పద్మ, సెక్టోరియల్ అధికారి సలోమి కరుణ, కార్యాలయ పర్యవేక్షకులు వెంకట రమణ, నర్సయ్య, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

ఇచ్చోడ, డిసెంబర్ 28: మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జున్ని గ్రామానికి చెందిన అడిగె జనార్దన్(50) మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది శనివారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరి తన పొలానికి వెళ్తానంటూ చెప్పి ఇచ్చోడ శివారులోని హనుమాన్ క్రషర్ వద్ద మామిడి చెట్టుకు ఉదయం 9.30 గంటలకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకునే ముందు కూతురికి వీడియో కాల్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపాడు. మృతునికి ముగ్గురు కూతుర్లు ఒక కొడుకు ఉన్నారు. కొడుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు.

క్షణికావేశంలో..

తలమడుగు, డిసెంబర్ 28: మద్యం తాగొద్దని భార్య మందలించడంతో క్షణికావేశంలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రుయ్యాడి గ్రామానికి చెందిన మీదం గంగన్న(41) మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం రాత్రి తాగి వచ్చి ఇంట్లో గొడవపడ్డాడు. భార్య మద్యం తాగొద్దని నచ్చచెప్పగా క్షణికావేశంతో ఇంటి దగ్గరలో ఉన్న ఊరు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంజమ్మ తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరి మృతి

దస్తురాబాద్, డిసెంబర్ 28: మద్యానికి బానిసై ఒకరు మృతి చెందిన ఘటన దస్తురాబాద్ మండలంలోని పెర్కపల్లె గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శంకర్,గ్రామస్తుల వివరాల ప్రకారం... మండలంలోని పెర్కపల్లెకు చెందిన